# గోపి

## వేలూరి మునుస్వామి

**మధ్యాహ్నం పన్నెండు గంటలు కావస్తోంది.**

**'అమ్మా! మాదాకబళం..." అన్నార్తుని కేకవిని ప్లేట్‌లో ఇంత అన్నం కూర తీసుకొని వాకిట్లోకెళ్ళింది శారద.**

**యువకుణ్ణి చూస్తూనే ఆమెకు విస్మయం కలిగింది.**

వాడు చాలా పసివాడు. ఆ వయస్సుకే యాచిస్తున్నాడంటే తల్లీ తండ్రీ లేకుండాలి. ఒకవేళ ఉన్నా వాడిని యాచనకు పంపయినా ఉండాలి.

మండుటెండలో పాపం, కాళ్ళకు చెప్పులు కూడా లేవు. జోలెలో అన్నం వేస్తూ 'నీ పేరేమిట్రా?' మాటల్లోకి దించింది శారద.

'గోపి!' వాడి సమాధానానికి శారదకు నవ్వొచ్చింది. తన భర్తపేరు అదే అయినంత మాత్రాన దేశంలో ఇంకెవరికీ ఆపేరుండరాదని రూలేంలేదని అంతలోనే సర్దుకుని మరో వివరమడిగింది.

అలా ఇద్దరూసంభాషణల్లో ఉండగా "యాచకునితో ఈవిడకేం కబుర్లు?" అని విసుక్కుంటూ...

'నీ పద్ధతేమయినా బాగుందా?' అనామెను మందలించాలని చేతిలో పేపర్ని పక్కనపడేసి వాలు కుర్చీలోంచి లేచాడు శారద భర్త.

ఆవేళ ఆదివారం.

ఆఫీసుకు సెలవైనందున రోజువారీ టెన్షన్ లేమీ లేకుండా తీరుబడిగా ఇంట్లో ఉంటే అసంకల్పితంగానే అతనికి ఈ సందర్భంతో టెన్షన్ ఒకటి...

వాకిలి దగ్గర కొచ్చేసరికి యాచకకుర్రాడు చెప్తున్నాడు. 'మా అమ్మానాన్నలెవరో నన్నుకని ఊరిబయట పారేసిపోతే కాకులు, కుక్కలపాలు కాకుండా జంగిడీలమ్మి బ్రతికే మంగమ్మవ్వ కాపాడి చేరదీసింది. ఆ అవ్వకు ఓ కొడుకుండేవాడనీ, మిలిటరీ కెళ్ళి ఈతను ఏదో యుద్ధంలో పొయాడనీ చెప్తుండేది. ఈ మధ్యనే ఆ అవ్వపోయింది. రోజూ ఇంతకబళం అడుక్కొని బ్రతుకుతున్నాను. నాకు దిక్కెవరూ లేరమ్మా ఇప్పుడు... ఆఖరిమాటలో వాడి గొంతు పూడుకు పోయింది. కళ్ళు సజలమయ్యాయి.

అంతా విన్న శారద భర్త హృదయం ద్రవించింది.

ఆ ముందు రోజు రాత్రి తను గోడనున్న ఫోటో ఫ్రేంకేసి తదేకంగా చూస్తూ నిలబడుండగా... ఎప్పుడొచ్చిందో భార్య, భుజంపై చెయ్యేసి 'భోజనా



నికి రండి' అంది.

తను మాట్లాడకపోయేసరికి మళ్ళీ ఆవిడే 'కన్న బిడ్డలున్నా వారిని మించి, చేరదీసిన మిమ్మల్నే బాగా ఆదరించాడాయన. పుట్టుట గిట్టుట కొరకే అన్నట్లు మీరెంత వగచినా పోయిన ఆ మహానుభావుడు తిరిగి రాగలడా? ఆ శోకంతో మీరు తిండి తిప్పలు మానేస్తే మిమ్మల్నే నమ్ముకు బ్రతుకుతున్న నేను, పిల్లలు ఏమైపోవాలి? పాశం ఉండాల్సిందే... అలాగని రాత్రు ళ్ళు నిద్రలేక, కడుపుకు తిండిలేక ఇలా అక్రోశిస్తుంటే ఆయనగారి ఆత్మమాత్రం శాంతిస్తుందా...' అలా ఏవేవో చెప్పి మొత్తానికి ప్రసన్నం చేసుకోగలిగింది.

ఇప్పుడు ఈ యాచక కుర్రాడి కథ అచ్చు తనలాంటిదే!

తనను చేరదీసి, ప్రయోజకుడిగా చేసి దూరమైన ఆ మహానుభావుడి ఆత్మ శాంతించాలన్నా, తనకతనిపై ఉన్న అపారమైన కృతజ్ఞతను చాటుకోవాలన్నా ఈ కుర్రాడిని చేరదీయడమే మార్గం!

ఈ నిర్ణయం తన నోటంట విన్న భార్య 'ఎంతకూ ఒకరినుంచి సాయం పొందడమేకానీ ప్రతిగా ఋణం తీర్చుకోవాలని కలనైనా మనసొప్పని వాళ్ళే ఎక్కువగా ఉన్న ఈరోజుల్లో మీలా ఆదర్శ భావాలు, కృతజ్ఞతా నైజం కలిగిన వారికి ఇల్లాలినవడం ఏజన్మలో నేను చేసుకున్న పుణ్యఫలం...' అని మెరిసే కళ్ళతో అంటున్నట్లు...

ఇద్దరూ కలిసి కుర్రోడిని చెరోపక్కా పొదివి పట్టుకొని లోనికి తోడ్కెళ్తున్నట్లు...

నిల్చున్న ఫళాన్నే కల కంటూ...

ఒక మంచిపనిచేయడానికి మనిషి హృదయమెంతగా ఉప్పొంగుతుందో స్వానుభవానికి తెచ్చుకొంటూ హుషారుగా ముందుకు అడుగేశాడు గోపి.

★